అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 321 | వరంగల్ | మంగళవారం, 29 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07



మనవలు.. మనవరాళ్లతో అనుబంధం చిరస్థాయిగా ఉండాలి

వయోవృద్ధులను గౌరవించడం మన బాధ్యత

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

చిన్నారులతో ప్రేమానుబంధాలపై ప్రత్యేక కార్యక్రమం

పెద్దలను గౌరవిద్దాం..

అమ్మమ్మ.. నానమ్మ.. తాతయ్యల ప్రేమను పొందుదాం..





అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలను ఎల్లప్పుడూ గౌరవించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. వారితో చిన్నారులు, విద్యార్థులకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం న్యూశాయంపేట (పోచంపల్లి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలు–మనవలు, మనవరాళ్ల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

- అక్షరశక్తి, హనుమకొండ

5

మేడారంలో 'ప్యారడైజ్'

చిత్రబృందం.. సమ్మక్క–సారలమ్మకు

ప్రత్యేక పూజలు

- నాని తులాభారం..
- 74 కిలోల బెల్లం సమర్పణ



3

రైతు–కూలీల హక్కుల కోసం ఐక్య పోరాటం

- ఖమ్మంలో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు ప్రారంభం
- రైతు–కూలీల ప్రాతినిధ్యం, అధికార సాధన కోసం ఉద్యమించాలి
- భూమి, ఉపాధి, కూలి, సామాజిక గౌరవం కోసం విశాల ఐక్యత అవసరం
- ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి

3





కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

అక్షరశక్తి, హనుమకొండ: పెన్షన్ రూల్స్ వాలిడేషన్ చట్టం-2025ను రద్దు చేయాలని టాప్రా జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల పరిరక్షణతో పాటు యూపీఎస్‌లోని వివక్షను తొలగించాలని, 8వ వేతన సంఘం పరిధిలో పెన్షన్ పునర్విమర్శను చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పెండ్యాల బ్రహ్మయ్య, బేతి శంకర్ లింగం, సిద్ది రాజయ్యతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి సాయం



అక్షరశక్తి, నర్సంపేట: ముదిరాజులు దానం చేసే స్థాయికి ఎదగాలని పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు సింగారపు రామకృష్ణ అన్నారు. నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన వేములపల్లి ఐలయ్య ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఒక క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పెసరు రాజన్న ఆదేశాల మేరకు జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ ముదిరాజ్ బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముదిరాజులు ఐక్యంగా ఉంటే తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. విద్యార్థులు, యువత అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నిరుపేద ముదిరాజ్ కుటుంబాలకు దాతల సహకారంతో తమవంతు సాయం అందించడమే లక్ష్యమని తాళ్ల రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓరుగంటి తిరుపతి, దండు రాంనర్సు, జల్లి ఐలయ్య, జినుకల నర్సయ్య, మారపాక నర్సయ్య, దండు రవి, పోలబోయిన నూతన్, పురుషోత్తం, బుచ్చిమల్లు, కొలిపాక నాగరాజు, దండు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో దామెర విద్యార్థులకు ద్వితీయ స్థానం



అక్షరశక్తి,దామెర: 70వ ఎస్‌జీఎఫ్ఐ హనుమకొండ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో దామెర మండలానికి చెందిన విద్యార్థులు వాలీబాల్ విభాగంలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని సాధించారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ అండర్-17 బాలుర, అండర్-14 బాలుర, అండర్-17 బాలికల విభాగాల్లో దామెర మండలం నుంచి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన క్రీడాకారులను దామెర మండల విద్యాశాఖాధికారి జమ్ము నాయక్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. కల్పన, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, జడ్‌పీహెచ్ఎస్ దామెర పీడీ ఎం. దేవేందర్, ఊరుగొండ పీడీ వి. లక్ష్మీనారాయణ, దామెర మండల ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి రాజేశ్వర్ అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు మరింతగా రాణించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించాలి





ఎర్రబెల్లి ప్రదీప్ రావు

అక్షరశక్తి,వరంగల్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో ఓ సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద బూడిద గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీస్తూ నిరసన తెలిపారు. భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ నూతన కలెక్టరేట్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రదీప్ రావు, జిల్లా వరంగల్‌లో ఉన్నప్పటికీ ప్రజలు ప్రభుత్వ పనుల కోసం హన్మకొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కుటుంబ సభ్యులకు పదవులు కల్పించడంపై ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు ప్రజలపై లేదని ప్రదీప్ రావు విమర్శించారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే నెలలో కనీసం 20 రోజులైనా నియోజకవర్గంలో అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో లేకపోతే రాబోయే రోజుల్లో క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కాకతీయుల చారిత్రక రాజధాని అయిన వరంగల్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్ ముందు కాకతీయ కీర్తి తోరణం లేకపోవడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే అంశమన్నారు. నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించి, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రదీప్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని, వరంగల్ తూర్పు ప్రజలకు అందుబాటులోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జలగం రంజిత్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, తాజా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మల్లాడి తిరుపతిరెడ్డి, బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరశురాములుకు ఘన సన్మానం



అక్షరశక్తి, వరంగల్: భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన మండల పరశురాములును తెలంగాణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రంగశాయిపేట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదాన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు దామెరకొండ సదానందం శాలువాతో మండల పరశురాములును సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దామెరకొండ సదానందం మాట్లాడుతూ భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న ప్రతిష్టాత్మక సేవా సంస్థ అని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ప్రతినిధులు సమాజంలోని నిరుపేదలు, అవసరమైన వారికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. మండల పరశురాములు గత అనేక సంవత్సరాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అంకితభావం కలిగిన సామాజిక కార్యకర్త అని కొనియాడారు.

రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సదానందం ఆకాంక్షించారు. అనంతరం పలువురు పరశురాములుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెర్న సోమేశ్వర్, సాంబయ్య, ఎమ్మడిశెట్టి రవీందర్, రామచందర్, పెరుమాండ్ల పరశురాములు, చిత్యాల రమేష్ బాబు, వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహనకు ఏజే పెడల్స్ సైక్లింగ్, వాకింగ్ ఛాలెంజ్





అక్షరశక్తి, వరంగల్: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏజే పెడల్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 21వ తేదీ వరకు ఏడు రోజుల సైక్లింగ్, వాకింగ్ ఛాలెంజ్‌ను నిర్వహించారు. ప్రజల్లో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ప్రతిరోజూ శారీరక వ్యాయామాన్ని అలవాటుగా మార్చుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడు రోజుల ఛాలెంజ్‌లో సైక్లింగ్, వాకింగ్ విభాగాల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేశారు. ఛాలెంజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సభ్యులకు ఏజే పెడల్స్ ఆధ్వర్యంలో నిర్వాహకులు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఏజే పెడల్స్ ఈవెంట్ ఆర్గనైజర్ నిఖిల్, జయంత్ నిర్వహించారు. జయరాజు, సంపత్, రమేష్, భారతి డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు, కృష్ణ, నాగరాజు, సోమశేఖర్ తదితరులు పాల్గొని ఛాలెంజ్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో సైక్లింగ్, వాకింగ్ వంటి శారీరక వ్యాయామాలను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భవిష్యత్‌లోనూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు నిఖిల్, ఈవెంట్ ఆర్గనైజర్ - 8341410768 లో సంప్రదించవచ్చు.

రైతు–కూలీల హక్కుల కోసం ఐక్య పోరాటం

- ఖమ్మంలో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు ప్రారంభం
- రైతు–కూలీల ప్రాతినిధ్యం, అధికార సాధన కోసం ఉద్యమించాలి
- భూమి, ఉపాధి, కూలి, సామాజిక గౌరవం కోసం విశాల ఐక్యత అవసరం
- ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి





అక్షరశక్తి, ఖమ్మం: రైతు-కూలీల హక్కుల కోసం పోరాటానికి నూతన దిశానిర్దేశం చేసేలా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 4వ జాతీయ మహాసభలు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రైతు-కూలీల నినాదాలు, అమరవీరుల త్యాగాలను స్మరించే నినాదాలు, విప్లవ గేయాలతో మహాసభల ప్రాంగణం మార్మోగింది. మహాసభల ప్రారంభ సూచకంగా ఏఐకేఎంఎస్ జెండాను ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ విప్లవ గేయాన్ని ఆలపించి, రైతాంగ, కూలీ ఉద్యమాల కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్ ఆహ్వానం పలికారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడం నేటి ప్రధాన కర్తవ్యమని ఆయన అన్నారు. రైతు-కూలీలు తమ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భూమి, ఉపాధి, కూలి, సామాజిక గౌరవంతోపాటు కుల అణచివేతకు వ్యతిరేకంగా కూడా రైతు-కూలీల ఐక్య ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

'రైతు–కూలీలకు నిర్ణయాల్లో ప్రాతినిధ్యం'

మహాసభలను ప్రారంభించిన ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి మాట్లాడుతూ 2021లో మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా చేసిన రైతాంగ ఉద్యమం ప్రజా ఉద్యమాల చరిత్రలో ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసిందన్నారు. ఐక్యంగా, దీర్ఘకాలం పోరాడితే పాలకులను వెనక్కి తగ్గించగలమనే విశ్వాసాన్ని ఆ ఉద్యమం రైతాంగంలో నింపిందని పేర్కొన్నారు. దేశానికి ఆహారాన్ని అందించే రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు జనాభాలో అత్యధికంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానాలు, మీడియా చర్చల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కనిపించడం లేదని అన్నారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, భారీ మౌలిక వసతులు, సాంకేతిక అభివృద్ధి, కార్పొరేట్ పెట్టుబడులు, 2047 నాటికి 'వికసిత్ భారత్' వంటి అంశాలను పాలకులు ప్రస్తావిస్తున్నారని, అయితే ఈ అభివృద్ధిలో చిన్న, సన్నకారు రైతు, వ్యవసాయ కూలీ, భూమిలేని పేద, దళితుడు, ఆదివాసీ, మహిళా కూలీ స్థానం ఏమిటని ప్రశ్నించారు.

అభివృద్ధి అంటే కొద్దిమందికి సంపద పెరగడం కాదని, ప్రతి కుటుంబానికి భూమి, పని, ఆదాయం, విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం లభించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. కనీస మద్దతు ధర, భూమి, కూలి, ఉపాధి, నీరు, విత్తనాలు, రుణాలు వంటి సమస్యలను కేవలం విడివిడిగా చూడకుండా, దేశ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న రైతు-కూలీలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు.

మూడు ప్రధాన సమస్యలను అభిగమించాలి

కార్పొరేట్ అనుకూల అభివృద్ధి నమూనా, వర్గ-కుల-పితృస్వామ్య ఆధిపత్యం, రైతు-కూలీ ఉద్యమాల్లోని విభజనలు, ఐక్యతా లోపాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని మనోరంజన్ మహంతి పేర్కొన్నారు. గనులు, భారీ ప్రాజెక్టులు, అనకట్టలు, పరిశ్రమల పేరుతో భూములు తీసుకోవడం, అడవుల విధ్వంసం, ప్రజల నిర్వాసితత్వం కొనసాగుతోందన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, గ్రామీణ పేదలు వివిధ రూపాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామస్థాయి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని, పంచాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీరు, ఉపాధి, స్థానిక అభివృద్ధి వంటి అంశాల్లో రైతు-కూలీలను క్రియాశీల భాగస్వాములుగా మార్చాలని పిలుపునిచ్చారు.

ప్రజా సంఘాల సంఘీభావం

ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు జయప్రదం కావాలని దేశంలోని వివిధ రైతు, కూలీ, ఆదివాసీ, మహిళా, విద్యార్థి సంఘాల నాయకులు సందేశాలు తెలిపారు. తమిళనాడు రైతు విముక్తి సంఘం తరఫున కె.సెల్వరాజ్, మల్కన్‌గిరి జిల్లా ఆదివాసీ సంఘం తరఫున సలహాదారు విజయ ఉపాధ్యాయ, ఏఐయూకేఎస్ తరఫున కె.రంగయ్య, కిసాన్ ఏక్తా కేంద్రం తరఫున కామ్రేడ్ ప్రవీణ్‌కుమార్, ఏఐకేఎంఎస్ తరఫున కె.మోహన్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ నుంచి కె.శ్రీనివాస్, పీఓడబ్ల్యూ తరఫున జాతీయ కోఆర్డినేటర్ జి.ఝాన్సీ, పీడీఎస్‌యూ జాతీయ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీలు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని వారు కోరారు. కార్పొరేట్ దోపిడీ, భూస్వామ్య ఆధిపత్యం, నిర్వాసితత్వం, కుల వివక్ష, మహిళలపై అణచివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాల ఐక్యతను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం కార్యదర్శి వేణు మహాసభల నిర్వహణకు సహకరించిన ఖమ్మం ప్రజలకు, విప్లవ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఏఐకేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అసిస్ మిట్టల్, ఉపాధ్యక్షులు సుశాంత్ ఝా, జే.వి.చలపతిరావు, శంభు ప్రసాద్, రామేందర్ సింగ్, బాలచంద్ర సడంగి, మండల వెంకన్న, బిక్షపతి, సుధాకర్, చిట్టిపాటి తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో 'ప్యారడైజ్' చిత్రబృందం.. సమ్మక్క–సారలమ్మకు ప్రత్యేక పూజలు

- నాని తులాభారం..
- 74 కిలోల బెల్లం సమర్పణ



అక్షరశక్తి, మేడారం: ప్రముఖ సినీ నటుడు నాని, 'ప్యారడైజ్' చిత్రబృందంతో కలిసి ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను మంగళవారం దర్శించుకున్నారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో చిత్రబృందం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంది. హీరో నానితో పాటు నటుడు సంపూర్ణేశ్ బాబు, చిత్ర దర్శకుడు ఓదెల శ్రీకాంత్, ఇతర చిత్రబృంద సభ్యులు మేడారం చేరుకుని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుని తులాభారం నిర్వహించారు. తులాభారంలో 74 కిలోల బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం చిత్రబృందం వనదేవతల ఆశీస్సులు పొందింది. మేడారం వెళ్లే మార్గంలో ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద కూడా నాని, చిత్రబృందం కొద్దిసేపు ఆగి గట్టమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం చేరుకున్నారు. 'ప్యారడైజ్' చిత్రంలో నాని తల్లి పాత్రకు 'సమ్మక్క' అనే పేరు ఉండటం, సమ్మక్క పేరుతో రూపొందించిన పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో చిత్రబృందం మేడారం వనదేవతలను దర్శించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. నాని, చిత్రబృందం మేడారం చేరుకున్న విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని సందడి చేశారు. నానిని చూసేందుకు అభిమానులు, సందర్శకులు ఆసక్తి చూపడంతో మేడారంలో సందడి వాతావరణం నెలకొంది.

శ్రీ అరబిందో సొసైటీ ఆధ్వర్యంలో గ్రంథావిష్కరణ




అక్షరశక్తి,హనుమకొండ: వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో ఇండికా, శ్రీ అరబిందో సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో డా. పింగళి గోపాల్ రచించిన స్టెప్పింగ్ ఇంటూ ది వరల్డ్ ఆఫ్ శ్రీ అరబిందో గ్రంథావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. గ్రంథాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ ములుగు శ్రీనివాస్ ఆవిష్కరించారు. గ్రంథ పరిచయం చేసిన వరిగొండ కాంతారావు మాట్లాడుతూ శ్రీ అరవిందులు దేశ ప్రథమ ప్రధానిగా, ఆనంద కుమారస్వామి ప్రథమ విద్యాశాఖ మంత్రిగా ఉండి ఉంటే దేశ స్వరూప స్వభావాలు మరింత మహోన్నతంగా ఉండేవని పుస్తకం వివరిస్తుందన్నారు. ఆచార్య యెల్లాప్రగడ సుదర్శనరావు మాట్లాడుతూ శ్రీ అరవిందులను చదివితే ప్రాచీన భారతం అర్థమవుతుందన్నారు. డా. ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ అధిమనస, అతిమానస శక్తుల గురించి వివరించగా, డా. అంజనీదేవి శ్రీ అరవిందుల గురించి ఎంత తెలుసుకున్నా తక్కువేనన్నారు. సభకు అధ్యక్షత వహించిన శ్రీ అరబిందో సొసైటీ హనుమకొండ శాఖ చైర్మన్ మాట్లాడుతూ 1972లో శ్రీ పూసాల రాజేశ్వరరావు, యాంసాని పుల్లయ్య, దుల్లూరి పురుషోత్తమరావు తదితరుల కృషితో హనుమకొండ శాఖ ప్రారంభమైందని, ప్రస్తుతం స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు డా. శివ సుబ్రమణ్యం శ్రీ అరవిందాశ్రమ శాఖను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. సౌమిత్రి లక్ష్మణాచార్య అఖండ భారతదేశం పునఃసిద్ధిస్తుందని శ్రీ అరవిందులు చెప్పారని పేర్కొన్నారు. రచయిత డా. పింగళి గోపాల్ శ్రీ అరవిందుల ప్రపంచంలోకి ప్రవేశించే అవకాశం తన అదృష్టమన్నారు. అనంతరం రచయితను, అతిథులను సత్కరించారు. పల్లె నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన సభ వందేమాతర గీతంతో ప్రారంభమై జనగణమన గీతంతో ముగిసింది. వందకు పైగా సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

టూరిజం ఫోటోగ్రఫీ పోటీలో శ్రవణ్ తడన్లకు ప్రథమ బహుమతి



అక్షరశక్తి,హైదరాబాద్: తెలంగాణ పర్యాటక రంగం, కళాసాంస్కృతిక వైవిధ్యాన్ని ఫోటోగ్రఫీ ద్వారా ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (FTCCI) టూరిజం కమిటీ నిర్వహించిన తెలంగాణ టూరిజం ఫోటోగ్రఫీ పోటీ-2026లో ములుగు జిల్లా పాలంపేట (రామప్ప)కు చెందిన ఫోటోగ్రాఫర్ శ్రవణ్ తడన్ల (S1 Studios) ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ జానపద కళలు, సంప్రదాయాలు, వారసత్వ కట్టడాలు, ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రాలను ఆహ్వానించగా, శ్రవణ్ తడన్ల సమర్పించిన చెరియాల్ కళాకారుడు సంప్రదాయ మాస్క్‌కు సహజ రంగులతో చిత్రాలు వేస్తున్న దృశ్యం ప్రథమ బహుమతికి ఎంపికైంది.హైదరాబాద్‌లోని FTCCI, జేఎస్ కృష్ణమూర్తి హాల్‌లో సెప్టెంబర్ 28న నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ డైరెక్టర్ ఎల్. రంజీత్ నాయక్, ఐఎఫ్ఎస్ చేతుల మీదుగా శ్రవణ్ తడన్ల అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాధా స్మెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అక్షత్ సరాఫ్, FTCCI అధ్యక్షుడు కె.కె. మహేశ్వరి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, వైస్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ అగర్వాల్, టూరిజం కమిటీ చైర్ ప్రకాశ్ అమ్మనబోలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, ప్రకృతి అందాలను ఫోటోగ్రఫీ ద్వారా పరిచయం చేయడం ఆనందంగా ఉందని, ఈ ప్రథమ బహుమతి తన ఫోటోగ్రఫీ ప్రయాణంలో మరపురాని ఘట్టమని తెలిపారు.



నారాయణ పాఠశాలలో విద్యార్థి నేతృత్వ సమావేశం



అక్షరశక్తి, కాజీపేట: గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్‌లోని నారాయణ పాఠశాలలో విద్యార్థి నేతృత్వ సమావేశం నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయ ఆర్‌అండ్‌డీ ప్రతినిధి సంగీత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడికి బదులుగా విద్యార్థి తన చదువు, ప్రగతి, ప్రతిభను తల్లిదండ్రులకు స్వయంగా వివరించడం ఈ సమావేశం ప్రత్యేకత అన్నారు. వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వాన్ ఇమ్రాన్ మాట్లాడుతూ విద్యార్థి తన తరగతి ప్రయాణం, ప్రాజెక్టులు, విజయాలను తల్లిదండ్రులకు వివరించడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ అనిత, జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, వి.పీలు అనూష, మౌనిక, అకడమిక్ డీన్ గణేష్, ఏవో గుంపుల చేరాలు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి



అక్షరశక్తి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి మంగళవారం తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి అనంతరం కేటీఆర్‌ను ఆమె కలిశారు. ఈ సందర్భంగా కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలో సమావేశం నిర్వహించి నియోజకవర్గ పరిస్థితులపై సమీక్షిస్తానని కేటీఆర్ తెలిపారు.

సీపీఆర్‌పై జయముఖి ఫార్మసీ కళాశాల విద్యార్థుల అవగాహన

అక్షరశక్తి, నర్సంపేట: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జయముఖి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నర్సంపేట ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు, సహాయకులు, ప్రజలకు ఆకస్మిక గుండెపోటు సమయంలో చేయాల్సిన ప్రాథమిక చికిత్సపై విద్యార్థులు ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ప్రజలు, వ్యాపారులకు సీపీఆర్ విధానాన్ని వివరించారు. కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాసుదేవమూర్తి మాట్లాడుతూ అత్యవసర సమయంలో వైద్య సహాయం అందేలోపు సరైన సీపీఆర్ చేయడం కీలకమన్నారు. డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ సయ్యదా నిషాత్ ఫాతిమా మాట్లాడుతూ విద్యార్థులు సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమ అధికారిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపు శ్వేత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఫార్మసీ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



హన్మకొండ పూర్వ డీపీఆర్‌వో అయూబ్ ఖాన్ పై విచారణకు ఆదేశం

- **డీఆర్‌వో శ్రీనివాస్‌ను విచారణ అధికారిగా నియమించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



అక్షరశక్తి, హన్మకొండ : హన్మకొండలో సమాచార, ప్రజా సంబంధాల శాఖాధికారిగా పనిచేసి ప్రస్తుతం వరంగల్ నగరపాలక సంస్థలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న అయూబ్ ఖాన్ పై విచారణకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస్ ను కలెక్టర్ నియమించారు. 20262028 సంవత్సరానికి గానుజర్నలిస్ట్ ల అక్రిడిటేషన్ కార్డుల జారీలో డిపిఆర్ఓ అయూబ్ ఖాన్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని తెలుపుతూ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ కి మంగళవారం రోజు లిఖితపూర్వ కంగా ఫిర్యాదు చేశారు. పది మందితో కూడిన అక్రిడిటేషన్ కమిటీ రెండు దఫాలుగా సమావేశమై ప్రతీ జర్నలిస్ట్ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించడమైనది. అర్హులైన జర్నలిస్ట్ ను గుర్తిస్తూ అర్హతలేని జర్నలిస్ట్ ను పెండింగ్ లో పెడుతూ తీర్మానం చేయడం జరిగింది. అయినప్పటికీ అక్రిడిటేషన్ కమిటీ సిఫారస్ ను పక్కన పెట్టడంతో పాటు,కలెక్టర్ ను తప్పుదోవపట్టించి డిపిఆర్ఓ ఇష్టానుసారంగా కార్డులు మంజూరి చేశారు. రాజకీయ పార్టీల నాయకుల వద్ద పనిచేసే వారికి, రియల్ టర్లకు,జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు కార్డులు జారీ చేశారు. డి పి ఆర్ ఓ అయూబ్ సమక్షంలో జరిగిన రెండు అక్రిడిటేషన్ కమిటీ సమావేశాల జాబితాను సభ్యులకు ఇవ్వట్లేదని తెలుపుతూ కలెక్టర్ కి పిర్యాదు చేయడం జరిగింది. పది మందితో కూడిన అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవ మూర్తి, మస్కపురి సుధాకర్, కంకణాల సంతోష్, బోల్ల అమర్, గోకారపు శ్యాం, వల్లాల జగన్, ఎన్. బుచ్చిరెడ్డి, నయీమ్ కలెక్టర్ కి పిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఈ విషయాలపై సానుకూలంగా స్పందించి వెంటనే డిఆర్ఓ శ్రీనివాసు ను విచారణ అధికారిగా నియమించారు. గత జాబితా నుంచి అనర్హులను తొలగించి, వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని సభ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి నూతన సాహిత్య ఆవిష్కరణలు



అక్షరశక్తి, కేయూ క్యాంపస్(హనుమకొండ): తెలుగు భాష అభివృద్ధి, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ కామర్స్ కళాశాల సెమినార్ హాల్‌లో తెలుగు విభాగం, మడికొండ స్పందన కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పెద్ది వెంకటయ్య రచించిన 'శబ్ద వాహిని (నానీలు)', 'సాహితీ చంద్రిక (వ్యాస సంపుటి)', 'అంబేద్కర్ మళ్లీ పుట్టాడు (నాటిక)' గ్రంథాల ఆవిష్కరణ, అంకితోత్సవం నిర్వహించారు. డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక యుగంలో విద్యార్థులు పుస్తక పఠనానికి దూరమవుతున్నారని, పుస్తకావిష్కరణలు వారిలో పఠనాసక్తిని పెంచుతాయని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ తెలుగు భాష వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 'శబ్ద వాహిని'ని ఆచార్య పాకనాటి జ్యోతికి, 'సాహితీ చంద్రిక'ను దివంగత ఆచార్య పేర్వారం జగన్నాథం తరపున కుమారులు పేర్వారం శంకర్‌రావు, పేర్వారం శ్రీనాథ్‌లకు, 'అంబేద్కర్ మళ్లీ పుట్టాడు'ను డాక్టర్ చిర్రా రాజుకు అంకితం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పెద్ది వెంకటయ్య, డాక్టర్ అంపశయ్య నవీన్, వి.ఆర్.విద్యార్థి, ఆచార్య ఎస్.నరసింహాచారి, డాక్టర్ ఎం.లింగయ్య, జి.కిషన్ ప్రసాద్, డాక్టర్ వాసిరెడ్డి కృష్ణారావు, డాక్టర్ పొరెడ్డి రంగయ్య, డాక్టర్ కర్రె సదాశివ, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బి.స్వామినాయక్, ఆచార్య వరలక్ష్మి, ఆచార్య అమరావేణి తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాటాలు ఉధృతం చేయాలి



అక్షరశక్తి, తొర్రూరు: కుల వ్యవస్థ నిర్మూలనకు నిరంతర పోరాటాలను ఉధృతం చేయాలని టీయూసీఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముందంపల్లి వీరన్న పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావం సందర్భంగా సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా తొర్రూరులో మున్సిపల్ కార్మికులతో సదస్సు నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు గురుకుయాకయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో రవి, వీరన్న మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని అన్నారు. పూలే విద్య, ఆస్తుల సమాన పంపిణీ, కుల నిర్మూలన, మహిళా విద్య వంటి అంశాలపై జీవితాంతం ప్రచారం చేశారని తెలిపారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి వెంకన్న మాట్లాడుతూ దళితులు, పీడిత వర్గాలు వివక్ష, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధరావత్ సంతోష్, మాచర్ల మురళి, యాకయ్య, నరసింహ, కుమార్, వెంకన్న, చంద్రయ్య, శ్రీరాములు, లక్ష్మీ, యాకమ్మ, వెంకటమ్మ, ఉపేంద్ర, మల్లేశ్వరి, వెంకటలక్ష్మి, ఎలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవిద్దాం..

- అమ్మమ్మ.. నానమ్మ.. తాతయ్యల ప్రేమను పొందుదాం..
- మనవలు.. మనవరాళ్లతో అనుబంధం చిరస్థాయిగా ఉండాలి
- వయోవృద్ధులను గౌరవించడం మన బాధ్యత
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- చిన్నారులతో ప్రేమానుబంధాలపై ప్రత్యేక కార్యక్రమం



అక్షరశక్తి, హనుమకొండ: అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలను ఎల్లప్పుడూ గౌరవించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. వారితో చిన్నారులు, విద్యార్థులకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం న్యూ శాయంపేట (పోచంపల్లి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలు-మనవలు, మనవరాళ్ల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కళ్లకు గంతలు.. బంధాన్ని గుర్తించిన చిన్నారులు

కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్‌కు అంగన్వాడీ చిన్నారులు, పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని తమ అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలను గుర్తించారు. బెలూన్లతో వారిని హత్తుకుని కొద్దిదూరం నడిచారు. తమ పెద్దలతో ఉన్న అనుబంధాన్ని విద్యార్థులు చక్కగా వివరించారు. ఈ దృశ్యాలు కార్యక్రమానికి మానవీయ స్పర్శను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలతో ఉండే అనుబంధం ఎంతో విలువైనదన్నారు. ఆ ప్రేమను జీవితాంతం కొనసాగించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు తమ పెద్దల పట్ల గౌరవం, ప్రేమను పెంపొందించేలా ప్రోత్సహించాలని కోరారు. వయోవృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అన్నప్రాసన.. సీమంతం

జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలతో ప్రేమగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజ్‌గౌడ్, ఎంఈవో మనోజ్‌కుమార్, జీసీడీవో సునీత, ఏసీడీపీవో సింధూరాణి, హెచ్ఎం ఉప్పలయ్య, ఎన్జీవో అధ్యక్షురాలు అనితారెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, దేవాచారి, దామోదర్, తేరాల యుగంధర్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, డీఎంసీ కళ్యాణి, డీసీ సుమలత, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



అక్షరశక్తి, హనుమకొండ: మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులు కాకుండా పూర్తిగా దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సరదా, స్నేహితుల ప్రభావం, ఆసక్తి వంటి కారణాలతో కొందరు యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని, ఒకటి రెండు సార్లు తీసుకుంటే ఏమవుతుందనే నిర్లక్ష్య ధోరణి క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతోపాటు కుటుంబం, సామాజిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. నార్కోటిక్ ఇన్స్పెక్టర్ కుమార్‌స్వామి మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాతో కలిగే చట్టపరమైన, ఆరోగ్య, సామాజిక పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ చందర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



అక్షరశక్తి, పరకాల: ప్రధాని నరేంద్ర మోదీ, హిందూ దేవతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మార్కెట్ సర్కిల్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ విమర్శలకు బీజేపీ సమాధానం చెబుతుందని, అయితే హిందూ దేవతలను రాజకీయ వ్యాఖ్యలకు ముడిపెట్టడం సరికాదన్నారు. హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుక్కల విజయ్‌కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, మాజీ అధ్యక్షులు మార్త బిక్షపతి, కానుగుల గోపీనాథ్, కార్యదర్శి దారుణ సునీల్, కుమార్, ఆకుల రాంబాబు, ఓబీసీ మండల అధ్యక్షుడు పైండ్ల రంజిత్‌కుమార్, బీజేవైఎం నాయకులు కక్కురాజు, కొలనుపాక రేవంత్ సిద్దు, బూత్ అధ్యక్షులు పిట్ట కిషోర్, దామ సతీష్, కాగితపు చంద్రమోహన్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌ఫీల్డ్‌లో డిప్యూటీ డీజీ పర్యటన





అక్షరశక్తి, వరంగల్: ఎన్‌సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డీజీ ఎయిర్ కమడోర్ నరసింగ్ సైలానీ మామునూరు ఎయిర్‌ఫీల్డ్, ఎన్‌సీసీ వరంగల్ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు తాంబరంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్ (ఏఐవీఎస్‌సీ)లో క్యాడెట్ల భాగస్వామ్యానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడి ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. అనంతరం వరంగల్ గ్రూప్ హెచ్‌క్యూలో గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ ఆర్. ఆయనకు స్వాగతం పలికారు. బెటాలియన్ల కమాండింగ్ అధికారులు, సిబ్బందితో శిక్షణ, పరిపాలనా అంశాలపై సమీక్షించారు. క్యాడెట్లకు శిక్షణ అందించిన ట్రైనర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. హనుమకొండ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్, మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను సందర్శించారు.

క్షయ నివారణపై ఎన్‌సీసీ అవగాహన



అక్షరశక్తి, వరంగల్: వరంగల్‌లోని లాల్‌బహదూర్ కళాశాలలో పదో తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాండిల్ ప్రతిజ్ఞతోపాటు గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. హనుమకొండ డీటీసీబీ జిల్లా నియంత్రణ విభాగం నుంచి డి.నగేష్, వి.సుష్మ పాల్గొని టీబీపై అవగాహన, ప్రత్యేక శిక్షణ అందించారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం పాల్గొన్నారు.

యువత సమస్యలపై ఉద్యమించాలి

అక్షరశక్తి, హనుమకొండ: భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి విద్య, ఉపాధి, యువజన రంగ సమస్యలపై యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీమాన్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రి శ్రీమాన్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత సైతన్యపరిచారని, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఆయన జీవితం, రచనలు, ఆలోచనలను యువత అధ్యయనం చేయాలని కోరారు. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్ష వంటి సమస్యలపై యువత పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లా ఆఫీస్ బేరర్లు పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, నాయకులు జెట్టి కృష్ణ, అల్లం శివ, ఓరుగంటి విజయ్, మురళి, కనకం కావ్యశ్రీ, సాంబరాజు శ్వేత తదితరులు పాల్గొన్నారు.





రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్‌గా రాజ్‌కుమార్

అక్షరశక్తి, దుగ్గొండి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా వైస్‌చైర్మన్‌గా దుగ్గొండి మండలం వెంకటాపురానికి చెందిన శానబోయిన రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో వసంత ఆయనకు నియామక పత్రం అందజేశారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి, ఉద్యోగం అనంతరం స్వగ్రామానికి వచ్చిన రాజ్‌కుమార్ 2014 నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది రెండుసార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 200 యూనిట్ల రక్తాన్ని అందిస్తున్నారు. 12 ఏళ్లలో 2,500 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందించారు. ప్రభుత్వ పాఠశాలల నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్కులు, దుస్తులు అందించడంతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించి యువతను సామాజిక సేవలో భాగస్వాములను చేస్తానని రాజ్‌కుమార్ తెలిపారు. ఆయనను అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు.

మహాముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ



అక్షరశక్తి, భూపాలపల్లి: వార్షిక తనిఖీల్లో భాగంగా మహాముత్తారం పోలీస్‌స్టేషన్, కాటారం సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఆయుధాగారం, విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించి నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు వాటిని సమర్థంగా వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈసాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్‌లో సిబ్బంది నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని, డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, ముత్తారం ఎస్ఐ రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అగ్రనేతలతో రేవంత్‌రెడ్డి చర్చ

అక్షరశక్తి, డెస్క్ : ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక నేతలతో భేటీ అయ్యారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో అర్థవంతమైన చర్చలు జరిపినట్లు రేవంత్‌రెడ్డి సోషల్ మీడియాలో తెలిపారు. తెలంగాణ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అయితే సీడబ్ల్యూసీ సమావేశంలో దేశానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు, ఎన్నికల జాబితాల అంశంతో పాటు దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన వ్యూహాలపైనా చర్చించే అవకాశం ఉందని సీఎం రేవంత్ తెలిపారు.



సమాజ మార్పు కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమించాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి
- సమస్యలపై స్పందించేది వామపక్ష విద్యార్థి సంఘాలే
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- వివిధ రంగాలలో ఉన్నత స్థాయికి ఎదిగిన నాయకులకు ఘన సన్మానం



అక్షరశక్తి, హనుమకొండ : సమాజ మార్పు కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉద్యమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా రెండవ రోజు హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని బాల వికాస కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విష బీజాలు నాటేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలన్నారు. విద్యార్థి సంఘాల ద్వారానే ఉత్తమ నాయకులు తయారు అవుతారని, తామంతా ఏఐఎస్ఎఫ్ నుంచే వచ్చామని, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నాటి నుండి సిపిఐ జాతీయ నాయకులందరూ ఒకప్పుడు ఏఐఎస్ఎఫ్ నాయకులే నని గుర్తు చేశారు. ఒకప్పుడు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలకే ఓటు హక్కు అని నినదించి సాధిస్తే నేడు ఉన్న ఓట్లను తొలగిస్తున్నారని, అలా దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని విమర్శించారు. విద్యారంగం సమస్యలతో పాటు ఏఐఎస్ఎఫ్ సామాజిక సమస్యలపై కూడా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నేడు సోషల్ మీడియా ప్రభావం కొనసాగుతున్నదని,దానిని ఉపయోగించుకున ఏఐఎస్ఎఫ్ నాయకులు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు.బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 90 ఏండ్ల గొప్ప చరిత్ర ఏఐఎస్ఎఫ్ దేనని, ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహద పడిందని చెప్పారు. నేడు కుల సంఘాల ప్రభావం పెరిగి పోతుండడం బాధాకరమని, అయినా వారి సమస్యలపై కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు దృష్టి సారించాలని సూచించారు. నేడు ఉన్నంత సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే నాలుగు దశాబ్దాల క్రితం తాము జెన్ జీ తరహాలో పోరాటాలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. తాము విద్యార్థి దశలో ఎన్నో ప్రతిబంధకాలు ఎదుర్కొన్నా మని, నాటి పరిస్థితి నేడు లేదని చెప్పారు. అక్కడ సమస్య ఉంటే అక్కడ స్పందించాల్సిన బాధ్యత వామపక్ష విద్యార్థి సంఘాలదేనని చెప్పారు.ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వరంగల్ లో ఏఐఎస్ఎఫ్ పెద్ద ర్యాలీ నిర్వహించడం ముందెన్నడూ చూడలేదని,కాకతీయ సామ్రాజ్య వారసులుగా వరంగల్ నుండే ఏఐఎస్ఎఫ్ గొప్ప ప్రస్తానం ప్రారంభించాలని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో అన్ని వర్గాల ప్రజల హక్కుల హననం జరుగుతున్నదని, రాబోవు రోజులు మరింత ప్రమాదకరంగా మారవచ్చునని, అంతకుముందే విద్యార్థి లోకం మేల్కొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చల్లా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం తాము చేసిన ఏఐఎస్ఎఫ్ పోరాటాల అనుభవాలు తనకు గొప్ప స్ఫూర్తిని కలిగించాయని చెప్పారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు సన్మానం

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఘనంగా సన్మానించారు. జాతీయ, రాష్ట్ర, వివిధ జిల్లాల నాయకులను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, బాగం హేమంత రావు, బాల నర్సింహా, సాబిర్ పాషా, బి. విజయ సారధి, కర్రె బిక్షపతి ,నేదునూరి జ్యోతి,పంజాల శ్రీనివాస్, బివి. విజయలక్ష్మి, వి. మదన్, ఆంజనేయులు, సృజన్ కుమార్, మేడిపల్లి శోభన్ బాబు, బీఆర్ లెనిన్, పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిరంగి రాజన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కని రెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వైఫల్యాన్ని కేసీఆర్‌పై మోపుతున్నావ్.. నాతో పెట్టుకోకు

కేటీఆర్‌పై కవిత ఫైర్



అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబర్ 29: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు (టీఆర్ఎస్) కవిత తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీరుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. తాను బీఆర్ఎస్ పార్టీలోని ఓ వ్యక్తిని విమర్శించినందుకే తనను కొన్ని గంటల్లోనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఇప్పుడు తాను విమర్శించిన వ్యక్తితో అంటకాగుతూ.. పార్టీ అధినేత తీరుతోనే నష్టపోయామని బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యతిరేకం కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. 'మీరు మీ పార్టీ అధినేత కేటీఆర్‌ను విమర్శించడం.. ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బాహాటంగా తప్పుపట్టడం పార్టీ వ్యతిరేక చర్య కాదా? మీ ఫాంహౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు.. ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు.. క్విడ్ ప్రోకో దందాలతో మీ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా?' అని కవిత నిలదీశారు. నిన్నటి బీఆర్ఎస్ మీటింగ్‌లో ఓ రైతు ఫోన్ మాట్లాడుతుంటే 'నీ పెండ్లామా!? అంత అర్జెంటా!? అని అహంకారంతో అతని భార్యనే అవమానించారని మండిపడ్డారు. అలాగే ఓ మహిళా సాయం కోరి వస్తే 'నా కోసం కన్నావా' అని అమ్మనే అవమానించారని ఆరోపించారు. 'గుంటనక్క MIND GAME లో BLIND గా పడిపోయి పెద్ద మనిషినే తప్పు బడుతున్నావ్.. బీఆర్ఎస్‌కు గోతిని తవ్వుతున్నావ్' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని.. మీ చేతగానితనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నావు అంటే... ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా? నిమజ్జనోత్సవంలో ఎంతమంది సోషల్ మీడియా influencers ను బతిమాలుకున్నారో ఆ గణేశ్ మహారాజుకు, మీ అంతరాత్మకు తెలుసు. నేను నీలాగా విష నాగుల మాటలు విని మాట్లాడను.. నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతాను.. నాతో పెట్టుకోకు!' అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి ఎక్స్‌లో కవిత పోస్ట్ చేశారు.

పత్తి అమ్మకాల్లో రైతులపై భారం పడొద్దు

అక్షరశక్తి, వరంగల్: పత్తి పంటను మార్కెట్‌లో విక్రయించే సమయంలో రైతులపై ఎలాంటి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం, అఖిలభారత కిసాన్ సంఘటన్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. 2026-27 సీజన్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుల సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. కౌలు రైతులను తక్షణమే గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారు పండించిన పత్తిని నేరుగా విక్రయించే అవకాశం కల్పించాలని కోరారు. లేకుంటే కౌలు రైతులు దళారులకు కనీస మద్దతు ధర కంటే తక్కువకు పత్తిని విక్రయించి నష్టపోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తిని ఎలాంటి ఖర్చులు లేకుండా కొనుగోలు చేయాలని, సీసీఐకి పత్తి విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ఆవరణలోకి తీసుకొచ్చిన పంటనే కొనుగోలు చేయడంతోపాటు ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున సీసీఐ కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, అఖిలభారత కిసాన్ సంఘటన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుధామల భాస్కర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



GUEST COLUMN

దుమ్ము రేపుతున్న మహిళా జర్నలిస్టులు



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

రితికా చోప్రా పేరు ఇప్పుడు భారతీయ జర్నలిజంలో మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో ఆమె నేతృత్వంలో వెలువడిన తాజా పరిశోధనాత్మక కథనాలు భారత ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై తీవ్రమైన ప్రశ్నలను ప్రజల ముందుంచాయి. ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు—సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి—గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో నిర్ణయాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ దర్యాప్తు వెల్లడించింది. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ, ఓటర్ల డేటాబేస్‌పై నియంత్రణ, ఎన్నికల సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలపై ఆ అభ్యంతరాలు ఉన్నాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అంతర్గత పత్రాలను పరిశీలించి వెల్లడించింది.

ఇది ఒక్క సంచలన కథనం కాదు. రితికా చోప్రా దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయాలు, ప్రభుత్వ పాలన, ప్రజా విధానాలు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై దృష్టి కేంద్రీకరించిన జర్నలిస్టు. కోల్‌కతాలో పుట్టిన ఆమె 2006లో హిందుస్తాన్ టైమ్స్ ఇంటర్న్‌గా జర్నలిజం ప్రారంభించారు. తరువాత మైల్ టుడే, ది ఎకనామిక్ టైమ్స్ రాజకీయ బ్యూరోలో పనిచేసి, 2015లో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్లో చేరారు. అక్కడ జాతీయ విద్యా సంపాదకురాలిగా, ప్రభుత్వ వ్యవహారాల జాతీయ బ్యూరో చీఫ్‌గా, జాతీయ విద్యా ఎడిటర్‌గా పనిచేసి, ప్రస్తుతం ముంబై రెసిడెంట్ ఎడిటర్‌గా ఉన్నారు.

ఆమెకు వచ్చిన అవార్డుల జాబితా కూడా ఆమె జర్నలిజం విస్తృతిని తెలియజేస్తుంది. 2021లో రాజకీయాలు, ప్రభుత్వంపై రిపోర్టింగ్‌కు రామ్‌నాథ్ గోయెంకా ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డు పొందారు. 2022లో ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్–ఇండియా అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం లభించింది. 2024లో గ్రీష్మా కుతార్‌తో కలిసి చామేలీ దేవి జైన్ అవార్డు అందుకున్నారు. అంతకుముందు హర్యానా పంచాయతీ ఎన్నికల్లో నిరక్షరాస్యుల పోటీపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభావాన్ని పరిశీలించిన కథనానికి యూఎన్ఎఫ్‌పీఏ–లాడ్లీ మీడియా అవార్డు, ఇంజినీరింగ్ విద్య నాణ్యతపై "దీవాల్యూడ్ డిగ్రీ" సిరీస్‌కు ఏసీజే ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అవార్డ్స్‌లో ప్రత్యేక ప్రస్తావన లభించాయి. ది ఎకనామిక్ టైమ్స్ లో పనిచేసిన సమయంలో కూడా ఆమెకు రెండు వర్డ్‌స్మిత్ అవార్డులు లభించాయి.

రితికా చోప్రా ప్రత్యేకత ఏమిటంటే, రాజకీయ నాయకుల ప్రకటనలను మాత్రమే వార్తలుగా మార్చడం కాకుండా; అధికార వ్యవస్థ లోపల ఏం జరుగుతుందో పత్రాలు, అధికారిక రికార్డులు, నిర్ణయ ప్రక్రియలను అనుసరించి వెలికి తీయడం. ఎన్నికల సంఘంపై ఆమె గత పరిశోధనలకు 2021 రామ్‌నాథ్ గోయెంకా అవార్డు రావడం కూడా దీనికి ఉదాహరణ.

ప్రశ్నించే కలం, గళం


సీ వనజ


తులసీ చందు


నేహా దీక్షిత్



రితికా చోప్రా

2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం పని తీరు, మోడల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యల్లో కనిపించిన ఆలస్యం, కమిషన్‌లోని విభేదాలపై ఆమె చేసిన ప్రత్యేక కథనాలకు ఐపీఐ అవార్డు లభించింది.

తాజా దర్యాప్తులో కూడా అదే పద్ధతి కనిపిస్తుంది. 'ఫాం -6' లో కొత్త ఓటర్ల నుంచి తల్లిదండ్రులు, తాతముత్తాతల వివరాలకు సంబంధించిన కొత్త ప్రకటనను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు అంతర్గత రికార్డులను ఆధారంగా చేసుకుని ఆమె వెల్లడించారు. మరో కథనంలో ఓటర్ల జాబితా నిర్వహణకు ఉపయోగించే "ఈసీఐ- నెట్" సాఫ్ట్‌వేర్, దాని కేంద్రీకృత నియంత్రణపై కమిషనర్ల ఆందోళనలను వెలుగులోకి తెచ్చారు. గోవాలో సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన ఓటర్లు జాబితాలోకి రాలేకపోయిన ఘటనను కూడా ఆమె పరిశీలించారు.

తెలుగు జర్నలిజంలో సీనియర్ జర్నలిస్టు సి. వనజ ప్రయాణం కూడా మహిళా జర్నలిస్టులు ఎదుర్కొన్న అడ్డంకులకు ఒక ఉదాహరణ. రాజకీయ రిపోర్టింగ్‌లో మహిళలకు అవకాశాలు పరిమితంగా ఉన్న కాలంలో ఆమె ఆ రంగంలోకి వచ్చారు. అసెంబ్లీ, రాజకీయ పరిణామాలపై రిపోర్టింగ్ చేస్తూ తన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. దండకారణ్యంలో మావోయిస్టుల 'జనతన సర్కార్' పై చేసిన రిపోర్టింగ్‌కు రామ్‌నాథ్ గోయెంకా అవార్డు రావడం ఆమె పరిశోధనాత్మక జర్నలిజానికి గుర్తింపు.

తులసీ చందు సంప్రదాయ మీడియా నుంచి డిజిటల్ జర్నలిజం వైపు వచ్చిన మరో డేరింగ్, డాషింగ్ జర్నలిజాని ముఖ్యమైన ఉదాహరణ. రాజకీయాలు, మత సామరస్యం, అవినీతి, సామాజిక సమస్యలపై ఆమె స్వతంత్రంగా వీడియో విశ్లేషణలు చేస్తూ పెద్ద ప్రేక్షక వర్గాన్ని ఏర్పరచుకున్నారు. అదే సమయంలో ఆన్‌లైన్‌లో తీవ్రమైన వేధింపులు, బెదిరింపులను ఎదుర్కొన్నట్లు మీడియా సంస్థలు నమోదు చేశాయి. ఆమెకు లాడ్లీ మీడియా అవార్డులు పలుమార్లు లభించాయి.

జాతీయ స్థాయిలో సుచేతా దలాల్ ఆర్థిక, పరిశోధనాత్మక జర్నలిజానికి చిరస్మరణీయమైన పేరు. 1992 హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టుల్లో ఆమె ఒకరు. ఆర్థిక రంగంలోని సంక్లిష్టమైన మోసాలను సాధారణ పాఠకుడికి అర్థమయ్యే భాషలో వివరించడం ఆమె ప్రత్యేకత. రిటు సరిన్ అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు జర్నలిజంలో భారతదేశానికి గుర్తింపు తెచ్చిన మరో పేరు. పనామా పేపర్స్, పారడైజ్ పేపర్స్, ఫిన్‌సెన్ ఫైల్స్, పాండోరా పేపర్స్ వంటి అంతర్జాతీయ దర్యాప్తుల్లో ఆమె భాగస్వామ్యం ఉంది.

నేహా దీక్షిత్ లింగం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, రాజకీయాలు వంటి అంశాలపై దీర్ఘకాలిక పరిశోధనాత్మక కథనాలు చేశారు. బర్కా దత్ కార్గిల్ యుద్ధం నుంచి సంఘర్షణ ప్రాంతాలు, విపత్తులు, రాజకీయాల వరకు ఫీల్డ్ రిపోర్టింగ్‌కు గుర్తింపు పొందారు. ధన్యా రాజేంద్రన్ ది న్యూస్ మినిట్ వ్యవస్థాపక సంపాదకురాలిగా డిజిటల్ జర్నలిజంలో మహిళా నాయకత్వానికి ఉదాహరణగా నిలిచారు. సుప్రియా శర్మ సామాజిక, మానవహక్కుల అంశాలను పరిశోధనాత్మకంగా రిపోర్ట్ చేశారు. చామేలీ దేవి జైన్ అవార్డు ఈ తరహా అనేక మంది మహిళా జర్నలిస్టుల కృషిని గుర్తించింది.

రాజకీయ విశ్లేషణ రంగంలో నీరజా చౌదరి ప్రత్యేకమైన స్థానం సంపాదించారు. దశాబ్దాలుగా ప్రధానమంత్రులు, రాజకీయ పార్టీలు, అధికార కేంద్రాల నిర్ణయ ప్రక్రియను విశ్లేషించిన ఆమె రచనలు భారత రాజకీయాల అంతర్గత స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. సెవంతి నినన్, నిరుపమా సుబ్రమణియన్, అర్ఫా ఖానుమ్ షెర్వాని, రోహిణి మోహన్, ప్రియాంక దూబే వంటి మహిళా జర్నలిస్టులు కూడా రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఘర్షణలు, పౌర హక్కులపై తమదైన ముద్ర వేశారు.

ఈ మహిళలందరిలోనూ ఒక సామాన్య లక్షణం కనిపిస్తుంది—ప్రశ్నించడం. అధికారంలో ఉన్నవారిని మాత్రమే కాదు, అధికారాన్ని నియంత్రించే సంస్థలను కూడా ప్రశ్నించడం. అయితే మహిళా జర్నలిజం విజయాలను కేవలం వ్యక్తిగత ధైర్యానికి పరిమితం చేయకూడదు. లింగ వివక్ష, కార్యాలయ అసమానత, ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, ఉద్యోగ భద్రత, స్వతంత్ర జర్నలిజానికి ఆర్థిక పరిమితులు వంటి సమస్యలు ఇప్పటికీ ఉన్నాయి.

రితికా చోప్రా తాజా దర్యాప్తు ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె కథనం లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం తన అధికారిక స్పందనలో 14 నోట్ల ఉనికి, తేదీలు, విషయాలను ఖండించలేదు; అయితే వాటిని "సూచనలు"గా పేర్కొంటూ గత ఏడాది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని తెలిపింది. అంటే కథనం వెలుగులోకి తెచ్చిన పత్రాలు ఒకవైపు, వాటిపై ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ మరోవైపు ఉన్నాయి. ఈ రెండింటినీ ప్రజలు పరిశీలించడం, సంబంధిత సంస్థలు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్య పారదర్శకతకు అవసరం.

అందుకే మహిళా జర్నలిజం అంటే కేవలం మహిళల సమస్యలపై రాయడం కాదు. దేశంలోని అత్యంత శక్తివంతమైన సంస్థలను కూడా పత్రాలతో, ఆధారాలతో, ప్రశ్నలతో పరిశీలించే సామర్థ్యం. రిటికా చోప్రా తాజా దర్యాప్తు ఆ విషయాన్ని మరోసారి గుర్తుచేసింది. వనజ నుంచి తులసీ చందు వరకు, సుచేతా దలాల్ నుంచి రిటు సరిన్ వరకు, నేహా దీక్షిత్ నుంచి నీరజా చౌదరి వరకు సాగిన ఈ ప్రయాణం భారత జర్నలిజంలో మహిళల పాత్రను "వార్తలు చెప్పేవారు" అనే స్థాయి నుంచి "అధికారాన్ని ప్రశ్నించే ప్రజాస్వామ్య కాపలాదారులు" అనే విస్తృత స్థాయికి తీసుకెళ్లిన పరిణామాన్ని చూపిస్తుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.